క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కడియం: వీరవరం హరిజనపేటలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం స్థానిక నాయకుడు పరమట పట్టాభి నోట్ పుస్తకాలను అందజేశారు. దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, ఎంపీటీసీ నేతల పాపారావు, స్థానిక నాయకులు బత్తుల రాము, రేమళ్ల ప్రసాద్, లంక కనకయ్య, పెద్దబ్బు, చినవీర్రాజు, పంచాయతీ సభ్యుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఏటా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పట్టాభిని పలువురు అభినందించారు. అలాగే పంచాయతీ కార్యాలయానికి వాటర్ ప్యూరిఫయర్ అందించారు.

డీఐపీసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా సాగర్



ఉత్తర్వులను అందుకుంటున్న సాగర్

ప్రకాశం నగర్: ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కానుబోయిన సాగర్‌ను డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐపీసీ)లో ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జీవో ఆర్డర్‌ను బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో ప్రత్యేక కార్యదర్శి కరికాల వలవన్ చేతుల మీదుగా అందుకున్నట్లు సాగర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆ కాపీలను స్టేట్ కమిషనర్ ఇండస్ట్రీస్, జిల్లా డీఐపీసీ చైర్మన్, కలెక్టర్, జిల్లా ఇండస్ట్రీస్ జీఎంలకు మెయిల్ ద్వారా పంపించినట్లు చెప్పారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రకాశం నగర్: విద్యార్థులు నిరంతరం కొత్త అంశాలను నేర్చుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు చైతన్య శేఖర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తిలక్ రోడ్‌లోని సాయి ఫిజియోథెరపీ నర్సింగ్ కళాశాలలో జరిగిన సదస్సుకు డాక్టర్ చైతన్య శేఖర్, పసల భీమన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొన్ని మ్యాజిక్‌లను ప్రదర్శించి విద్యార్థులను అలరించారు. జన విజ్ఞాన వేదిక కన్వీనర్ ఎం.మల్లికార్జునరావు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో మూఢ నమ్మకాలు పేరుకుపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రిన్సిపల్ డి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

సీటీఆర్ఐ: ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టా వెంకటేష్‌ను గురువారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. సీతంపేట కృష్ణానగర్‌లోని వెంకటేష్ నివాసానికి వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఢిల్లీలో ఉన్న ఎంపీ భరత్ రామ్.. కట్టా వెంకటేష్ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎస్వీ శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జి కొత్తా విజయ రాజ్యలక్ష్మి, అరిగెల బాబు, సుంకర అంజిబాబు, వి.కృష్ణవేణి, సాయిబాబా ఉన్నారు.

బ్యాంకును మోసగించారంటూ ఫిర్యాదు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కొంతమూరుకు చెందిన మామిడి సతీష్ కుమార్ కారు రుణం కోసం తప్పుడు డాక్యుమెంట్లు, ష్యూరిటీలు పెట్టి మోసం చేశాడంటూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కంబాల చెరువు మెయిన్ బ్రాంచి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్ గురువారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సతీష్ కుమార్ కారు కొనుగోలుకు రూ.12 లక్షల రుణం తీసుకున్నాడు. వాయిదాలను సక్రమంగా చెల్లించకపోవడంతో ఫీల్డ్ ఆఫీసర్లు అతడి గురించి వాకబు చేశారు. బ్యాంకు కారుకు లోన్ కోసం కేవలం రూ.9 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, నకిలీ డాక్యుమెంట్లు, ష్యూరిటీలు పెట్టి రూ.12 లక్షల రుణం పొందినట్లు గుర్తించారు. ఈ మేరకు త్రీటౌన్ ఎస్సై అమీనా బేగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకువస్తాం

సీటీఆర్ఐ: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని అర్బన్ కమిటీ ద్వారా సమర్థంగ నిర్వహించేందుకు కృషి చేస్తామని టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు అన్నారు. స్థానిక వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో అర్బన్ కమిటీని పరిచయం చేశారు. తమకు అవకాశం కల్పించిన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, ఇతర టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మూడునెలల ముందుగానే..

- పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు
- ఎండీయూ వాహనాల ద్వారా తరలింపు



కడియం మండల విద్యావనరుల కేంద్రం నుంచి ఎండీయూ వాహనంలో తరలిస్తున్న పాఠ్యపుస్తకాలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ క్రమంలో పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను ప్రభుత్వం అందజేసింది. తాజాగా 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే సెమిస్టర్–2కు సంబంధించిన పాఠ్యపుస్తకాలను దాదాపు మూడు నెలల ముందే పాఠశాలలకు చేర్చేందుకు చర్యలు తీసుకున్నారు.

రెండు సెమిస్టర్లకు కుదింపు

గతేడాది 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు మూడు సెమిస్టర్లు అమలు చేయగా, ఈ ఏడాది నుంచి రెండు సెమిస్టర్లకు కుదించారు. రాజమహేంద్రవరం అర్బన్, రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాలకు 1 నుంచి 9 తరగతులకు 89,459 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, ఇప్పటికే మండలాలకు చేరాయి. కడియం మండలంలో పాఠశాలలకు ఇప్పటికే ఎండీయూ వాహనాలు ద్వారా తరలించారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోనూ తరలింపు జరిగింది. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో రెండు రోజుల్లో పూర్తి చేయనున్నారు. సివిల్ సప్లయిస్ ఎంఎస్‌వోలు, మండల విద్యాశాఖాధికారులు సమన్వయంతో పాఠశాలలకు ఎండీయూ వాహనాలు ద్వారా పాఠ్య పుస్తకాలను మండల కేంద్రం నుంచి తరలిస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌కు 46,948, రాజమహేంద్రవరం రూరల్ మండలానికి 27,873, కడియం మండలానికి 14,638 పాఠ్యపుస్తకాలు చేరాయి.



సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలు

'పోలవరం' నిర్వాసితుల కోసం 7న ఢిల్లీలో ధర్నా



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రకాశం నగర్ : గోదావరి వరద బాధితులకు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన కాఫర్ డ్యాం కారణంగా మూడేళ్లగా విలీన మండలాలు పూర్తిగా ముంపుబారిన పడుతున్నాయన్నారు. నిర్వాసితులకు పునరావాసం తన బాధ్యత కాదంటున్న కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు అండగా అన్ని పార్టీలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. దీన్ని జాతీయ సమస్యగా పరిగణించి ఆగస్టు 7న ఢిల్లీలో జరిగే ధర్నాకు తరలి రావాలని ఆయన కోరారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పునరావాసం కేంద్ర ప్రభుత్వం బాధ్యతేనని, ప్రాజెక్టు అంచనా విలువ రూ.55 వేల కోట్లలో రూ.33 వేల కోట్లు పునరావాసానికే ఖర్చు చేయాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1.06 లక్షల కుటుంబాలకు గానూ కేవలం 12 వేల కుటుంబాలకే ఇప్పటికి పరిహారం అందించారన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రకాశం నగర్: ఏపీఈపీడీసీఎల్ 33/11 కేవీ వెంకటేశ్వరనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. తోట రాములు నగర్, జయశ్రీ గార్డెన్స్, పిల్లివారి స్ట్రీట్, రామాలయం సెంటర్, ఏకేసీ కాలేజీ ఏరియా, శ్రీనివాస నగర్, శ్రీనివాస గార్డెన్స్, గోపాలనగర్ వుంత, బాలాజీ స్ట్రీట్, వెంకటేశ్వర స్వామి టెంపుల్ ఏరియా , కోట సత్తెమ్మ గుడి ప్రాంతం, ఏవీ అప్పారావు రోడ్డు, అద్దెపల్లి కాలనీ, మహాలక్ష్మి గుడి ప్రాంతం, కాంచన నగర్, వెంకటేశ్వర నగర్, కోదండ రామాలయం ఏరియా, షీలా నగర్, జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డు, కొక భాస్కరమ్మ నగర్ ప్రాంతాల్లో సరఫరాకు ఉండదన్నారు.

7న తిరుపతిలో జాతీయ ఓబీసీ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

సీటీఆర్ఐ: బీసీలకు జరుగుతున్న అన్యాయంపై చర్చించేందుకు తిరుపతిలో ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యకుడు కేశన శంకరరావు తెలిపారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 29 రాష్ట్రాలకు చెందిన 59 వేల మందికి పైగా బీసీ ప్రతినిధులు మహాసభకు హాజరవుతారన్నారు. అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా బీసీల డిమాండ్లపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించకుంటే ఉద్యమాలు చేయడానికి వెనుకాడబోమన్నారు. బీసీ కులగణనపై జాతీయస్థాయిలో ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీ కులగణన చేస్తామని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో బీసీ యూత్ ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు, ఉపాధ్యక్షుడు శ్రీను, మార్గాని కిరణ్, డి.రాంబాబు, పోలవరం హరిబాబు, పులి సాగర్, కె.వాసు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన



ఒకటో డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..

ప్రకాశం నగర్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని, ఆయనను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఒకటో వార్డు లాలాచెరువు మార్కెట్ రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముప్పన ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కోఆర్డినేటర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తొలిసారిగా గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు ప్రజలకు డాక్టర్ గూడూరిని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రం మరింత ప్రగతి పథంలో పయనించాలంటే జగనన్న మరోసారి ఈ రాష్ట్రానికి సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు.

23న విద్యార్థులకు సన్మానం

ప్రకాశం నగర్: జూనియర్ ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈనెల 23వ తేదీన తాడితోట వెంకటేశ్వర కాంప్లెక్స్‌లోని మాస్టర్ మైండ్స్ ప్రాంగణంలో సన్మానం చేస్తున్నట్టు అడ్మిన్ ప్రిన్సిపల్ ర్యాలీ వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ గ్రూప్ స్టేట్ సిలబస్‌లో 430, ఎంఈసీలో 470, సీఈసీలో 450, ఆపైన మార్కులు వచ్చిన విద్యార్థులు అర్హులన్నారు. ఆధార్ కార్డు, మార్కుల జాబితాతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 92487 22264 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



బొమ్మూరులో పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



వేమగిరిలో సర్టిఫికెట్ల ప్రదానం

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- పలువురికి ధ్రువీకరణ పత్రాల ప్రదానం

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని 42, 44, 45, 46 వార్డులలో జగనన్న సురక్ష కార్యక్రమాలను ఆయా వార్డు ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలకు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న జగన్‌ను సీఎంగా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అనంతరం పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, ఆర్ఎంసీ మేనేజర్ శ్రీనివాస్, ఎస్సై అమీనా బేగం, వైఎస్సార్ సీపీ నాయకులు గూడూరి రాధిక, క్లస్టర్ ఇన్‌చార్జిలు బర్రె కొండబాబు, మజ్జి అప్పారావు, కొత్తా విజయలక్ష్మి, ఎస్వీ శ్రీనివాస్, కాంతా పటేల్, కొమ్ము జిగ్లేర్, ఆయా డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉన్నత లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎస్ జ్యోతి అన్నారు. గురువారం బొమ్మూరులోని ఏఎంజీ ఆడిటోరియంలో గ్రామసచివాలయం–1 జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 1,850 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు కేఎస్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు యెనుముల త్యాగరాజు, మేడపాటి సద్గుణ రామారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాస్, పార్టీ నాయకులు ఎలుగొండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- పిడింగొయ్యి గ్రామసచివాలయం–4 పరిధిలో మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా 1,156 మందికి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్‌జేఈ అనిల్, పంచాయతీ కార్యదర్శి ఎం.రూప్‌చంద్, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకులు చీరా రాజు, దాసరి శివకుమార్, పడాల వీరరాఘవరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కడియం: ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను సంబంధిత శాఖల సిబ్బంది వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యాన శాఖాధికారి కె.రాధాకృష్ణ అన్నారు. మండలంలోని వేమగిరి సచివాలయం 3, కడియపులంక సచివాలయం 3 పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కడియపులంకలో 1100, వేమగిరిలో 250 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల జేసీఎస్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి, తహసీల్దార్ ఎం.సుజాత, ఎంపీడీవో కె.రత్న కుమారి పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి.. పింఛన్ పంపిణీ

వాలంటీర్లకు వందనం



హైదరాబాద్‌లో భార్గవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ బుంగా రాజు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం బత్తిన సుబ్బారావు కాలనీకి చెందిన యల్లమిల్లి భార్గవికి దివ్యాంగ పింఛన్‌ను వలంటీర్ గ్రామ సచివాలయం 5 వలంటీర్ బుంగా రాజు అందించేవాడు. అనారోగ్యం దృష్ట్యా వైద్యం చేయించేందుకు భార్గవిని ఆరునెలల క్రితం హైదరాబాద్ తీసుకుని వెళ్లి అక్కడే ఉండి వైద్యం చేయిస్తున్నారు. రెండు నెలలు పింఛన్ తీసుకోకపోతే రద్దయిపోతుందన్న ఉద్దేశంతో బుంగా రాజు మూడుసార్లు హైదరాబాద్ వెళ్లి దివ్యాంగ పింఛన్ అందించాడు. ట్రైన్ చార్జీలు భార్గవి తల్లి చంద్రకుమారి పెట్టుకున్నప్పటికీ హైదరాబాద్ వెళ్లాలంటే రెండు రోజుల సమయం పడుతుంది. అది లెక్కచేయకుండా బుంగా రాజు మూడుసార్లు వెళ్లి పింఛన్‌ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడని పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు, తోటి వలంటీర్లు అభినందించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

వలంటీర్ బుంగా రాజు మా కుమార్తె భార్గవికి పింఛన్ అందించేందుకు మూడుసార్లు వచ్చాడు. రెండు నెలలు తీసుకోకపోతే పింఛన్ పోతుందన్న ఉద్దేశంతో వలంటీర్ హైదరాబాద్ వచ్చి, అందించాడు. ఆయన సేవలు అభినందనీయం. వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం.

– యల్లమిల్లి చంద్రకుమారి, హైదరాబాద్

న్యాయసేవలను వినియోగించుకోవాలి



మహిళా జైలులో చిన్నారితో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళా ఖైదీల తరఫున వాదించేందుకు, బెయిల్ పిటీషన్ల కోసం, ఇతర కోర్టు ప్రొసీడింగ్స్‌లో సహకరించేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. ఆమె గురువారం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయసేవలను వారికి తెలియజేశారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. మానసిక చికిత్స విభాగాన్ని, మాదక ద్రవ్యాల వ్యసన విముక్తి కేంద్రాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను, ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

16 నుంచి సీపీఐ బస్సుయాత్ర



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ప్రకాశం నగర్: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ ఆరు వరకూ సీపీఐ బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మతోన్మాద బీజేపీని గద్దె దింపేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న మానవత విధ్వంసం ఘోరమని, అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి వెళ్లిన మహిళా సమాఖ్య జాతీయ నేత అనీరాజాపై దేశద్రోహం కేసు నమోదు చేయడం సరికాదన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ఈనెల 25న సంఘీభావ సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయడంలో, నిర్వాసితులకు న్యాయం చేయడంలో విఫలమైందన్నారు. ప్రత్యేక హోదా, కడప స్టీల్ ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల విషయంలో మోదీ సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌మాధవీలత



కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందిస్తున్న జైనులు

రాజమహేంద్రవరం రూరల్: విభిన్న ప్రతిభావంతుల, దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, చట్టాలు, హక్కులపై వారు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. వైఎస్సార్ సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ తదితరులు గురువారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2016 వికలాంగుల హక్కుల చట్టం పోస్టర్‌ను కలెక్టర్ మాధవీలత ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని, అందులో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు వారికి కేటాయించిన పథకాల లబ్ధిని అందిస్తోందన్నారు. సంస్థలు, ఆసుపత్రులు, పాఠశాలల్లో విభిన్న ప్రతిభావంతులపై వివక్ష చూపినా, వారిని నిర్లక్ష్యం చేసినా, అవమానించి హింసించినా కేసులు నమోదు చేస్తారన్నారు. బందెల కిరణ్ రాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ దివ్యాంగులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దల అను, అల్లుడు జయరాజు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

సీటీఆర్ఐ: ఇటీవల కర్నాటకలో జైన సన్యాసిని (స్వామీజీ) దారుణంగా హత్య చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జైన్‌సంఘ్ సభ్యులు గురువారం కలెక్టర్ మాధవీలతకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో జైన్లు మైనారిటీలుగా ఉన్నప్పటికీ, దేశం ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ పని చేస్తున్నారన్నారు. స్వామిజీని హత్య చేసిన దుండగలకు శిక్ష పడేంత వరకూ తాము శాంతియుతంగా నిరసన తెలియజేస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో విక్రమ్ జైన్, ముకేష్ జైన్, అశోక్ జైన్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో సిబ్బంది పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధికి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు కోరారు. శ్యామలా సెంటర్‌లోని డీసీసీబీ బ్రాంచి ఆవరణలో గురువారం రాజమహేంద్రవరం డివిజన్ డీసీసీబీ బ్రాంచి మేనేజర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రుణాలు వసూలు చేయాలని, డిపాజిట్లను పెంచాలన్నారు. ప్రతి రైతును స్వయంగా కలిసి వారి రుణాల గురించి వివరించాలని ఆదేశించారు. డీసీసీబీ సీఈవో ఆర్‌వీ నరసింహారావు మాట్లాడుతూ బ్రాంచ్ మేనేజర్లు డిపాజిట్లు, రికవరీలు పెంచడంతో పాటు ఓవర్‌డ్యూస్ లేకుండా చూడాలన్నారు. కొత్తగా రైతునేస్తం అనే పథకం ద్వారా ఎకరానికి రూ.8 లక్షల రుణం మంజూరు చేయడానికి నిర్ణయించామన్నారు. గౌతమీ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ అధికవడ్డీకి 60 నెలలకు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సమావేశంలో ఆప్కాబ్ ఓఎస్‌డీ రాజీవ్ బాబు, డీసీసీబీ జీఎం ప్రవీణ్ కుమార్, ప్రకాష్ , డీజీఎం శ్రీధర్ చౌదరి, అన్ని బ్రాంచ్‌ల నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కేరళ బృందం పర్యటన

మధురపూడి: కేరళలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఇండియా వైద్యబృందం గురువారం కోరుకొండ పీహెచ్‌సీ, కణుపూరు, రాజవరం గ్రామాలను సందర్శించింది. కోరుకొండ పీహెచ్‌సీ భవనంలో రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్యసేవలను ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే కణుపూరు, రాజవరం గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలను అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసు కున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ బృందంలో డాక్టర్ రాజేష్ జె.నాయర్, మాథ్యూ ఎంసీలతో పాటు జిల్లాకు చెందిన వైద్యాధికారులు అభిషేక్, సుధీర్, రాజేష్ ఉన్నారు. కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రవిచంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.